క్లుప్తంగా

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 9వ వార్డులో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కౌన్సిలర్ చోప్పరపు మాధవి శివ, ఏఈ పవన్‌కుమార్, లైన్‌మెన్ వెంకటయ్య, జిలానీ, బాషా, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అటవీ దినోత్సవం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: అడవులు ఆహార భద్రతకు చాలా ముఖ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. అనంతరం ఎంఈఓ జి.సంజీవి మాట్లాడుతూ మొక్కలు పెంచడం, అడవులను సంరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. అడవులు ఆహార భద్రతకు, పోషకాలను, జీవనోపాధికి సహాయ పడతాయన్నారు. గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపు లబ్ధిదారులకు వయో పరిమితి పెంచాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం కాపులకు వయో పరిమితి పెంచి స్వయం ఉపాధి పథకం అమలు చేయాలని కాపు సంఘ మండల అధ్యక్షుడు తాటి యలమంద కోరారు. పొన్నలూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాల కోసం ఈబీసీ కార్పొరేషన్ ద్వారా కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రహ్మణ వంటి కులాల వారికి వయో పరిమితిని 21 నుంచి 60 సంవత్సరాలకు పెంచారన్నారు. కానీ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలైన కాపులకు మాత్రం 21 నుంచి 50 ఏళ్ల వరకు మాత్రమే అర్హులుగా ప్రకటించారన్నారు. వయసు కుదించడం వలన చాలా మంది కాపు కుటుంబాల వారు కాపు కార్పొరేషన్ ద్వారా అందించే స్వయం ఉపాధి పథకాలు కోల్పోతారన్నారు. మిగిలిన కులాల మాదిరిగా కాపులకు కూడా వయోపరిమితిని 60 ఏళ్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

మత్స్య సంపద పెంచాలి

టంగుటూరు: కేంద్ర ప్రభుత్వం మత్స్య సంపద పెంచడానికి సబ్సిడీపై చేపలు, రొయ్యల పిల్లలను అందిస్తోందని, ప్రతి ఒక్కరూ మత్స్య సంపద పెంచాలని మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ సూచించారు. సబ్సిడీపై అందించిన చేప పిల్లలను శుక్రవారం మండలంలోని వల్లూరు చెరువులో ఆయన వదిలారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీపై వల్లూరు చెరువులో 53 వేల చేపపిల్లలు వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు, టంగుటూరు, సింగరాయకొండ మత్స్యశాఖ అధికారులు రవికుమార్, వర్షిణి పాల్గొన్నారు.

సూరసాని లక్ష్మీరెడ్డికి ఘన నివాళి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి

కనిగిరి రూరల్: పేద వర్గాల అభివృద్ధి కోసం పనిచేసిన గొప్పవక్తి సూరసాని లక్ష్మీరెడ్డి అని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మీరెడ్డి ఆరో వర్ధంతి సభ సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ లక్ష్మీరెడ్డి వ్యవసాయ అధికారిగా, సీపీఎం నేతగా అనేక సేవలు అందించారని కీర్తించారు. పార్టీ నిర్మాణంలో లక్ష్మీరెడ్డి కృషిని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు అచ్చిరెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె.రాజు, కె.కృష్ణమూర్తి, పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు, పి.మహేష్, ఎస్.పిచ్చిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

టంగుటూరు: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో డీఎస్పీ మాట్లాడుతూ కొత్త వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, జూదం వంటి దురలవాట్లకు బానిసలై జీవితాలను పోగొట్టుకోవద్దని తెలిపారు. గ్రామంలో సమస్యలడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు, ఏఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మాస్టర్ ప్లాన్‌కు మోక్షమెప్పుడో...

- పెండింగ్‌లో కందుకూరు మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్
- పెరుగుతున్న జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిన అధికారులు
- ప్రభుత్వం నుంచి ఆమోదం రాక మూలనపడిన ప్లాన్



కందుకూరు పట్టణ వ్యూ

కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీ నూతన బృహత్ ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్)కు మోక్షం లభించడం లేదు. మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధమైనా, ప్రభుత్వం నుంచి అనుమతులు రాక మూలనపడింది. వాస్తవానికి గతేడాది నుంచే అమలు కావాల్సిన మాస్టర్‌ప్లాన్, పలు సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాల వల్ల కొంత ఆలస్యమవుతూ వస్తోంది. డ్రాఫ్ట్ ప్లాన్‌లోని తప్పులను సరిదిద్ది ఉన్నతాధికారులకు పంపినా నూతన ప్లాన్‌కు మాత్రం మోక్షం లభించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపై అటు ప్రజాప్రతినిధులు గానీ, ఇటు అధికారులు గానీ కనీసం దృష్టి పెట్టడం లేదు. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటి ప్లాన్ పొందాలన్నా, పారిశ్రామిక లైసెన్స్‌లు వంటి వాటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంటి ప్లాన్‌లు రాక ఇబ్బందులు

పెరిగిన పట్టణ విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో దశాబ్దాల తరబడి నివాసాలు ఉంటున్నా మున్సిపాలిటీ నుంచి కనీసం ఇంటి ప్లాన్ పొందాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా పామూరు రోడ్డు జంక్షన్ నుంచి తానికొండ కొస్టాల వరకు పారిశ్రామిక ప్రాంతంగా పాత మాస్టర్‌ప్లాన్‌లో చూపించారు. తానికొండ కొస్టాలకు తూర్పున ఉన్న ప్రాంతాన్ని గ్రీన్‌జోన్‌గా చూపించారు. కేసరిగుంట ప్రాంతంలో పట్టాభూముల ఉన్నా మాస్టర్‌ప్లాన్‌లో కుంటభూమిగా నమోదు చేశారు. కనిగిరి రోడ్డులో కోర్టు అవతల పారిశ్రామిక ప్రాంతంగా నమోదైంది. అయితే ప్రాంతాలన్నీ పూర్తిగా నివాసాలతో కూడి ఉంటాయి. ఎలాంటి పరిశ్రమలు ఆ ప్రాంతాల్లో లేవు. దీంతో ఈ ప్రాంతాల వాసులు ఇంటి ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో అనధికారికంగా ఇంటి నిర్మాణాలు చేసుకోవాల్సిన పరిస్థితి. అలాగే ఏ బ్యాంకులు కూడా ఇక్కడి ఆస్తులపై పైసా రుణం పొందే అవకాశం కూడా ఉండడం లేదు. ఇటువంటి అన్ని సమస్యలను సరిదిద్దుతూ నూతన మాస్టర్‌ప్లాన్ తయారు చేసినా అది ఆమోదానికి నోచుకోవడం లేదు.

నూతన మాస్టర్ ప్లాన్ ఇలా

ప్రస్తుతం రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం కందుకూరు మున్సిపాలిటీ విస్తీర్ణం 60.32 చ.కి.మీ. మొత్తం 7151 హెక్టార్ల విస్తీర్ణం గృహ, వాణిజ్య, పబ్లిక్ తదితర అవరాలకు అనుగుణంగా ప్రాంతాలను విభజిస్తూ మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్‌ను 2041 వరకు ఉండేలా ప్రాణాళిక రూపొందించారు. నూతన ప్లాన్ ప్రకారం గతంలో పామూరు రోడ్డులో ఉన్న పారిశ్రామిక జోన్‌ను ఆనందాపురం రోడ్డుకు, గ్రీన్ జోన్‌ను చాకలికుంట సమీపంలోకి మార్చినట్లు తెలుస్తుంది. కేసరిగుంట కాలనీ ప్రైవేట్ భూమిగా నమోదు చేశారు. అలాగే పట్టణం చుట్టూ జాతీయ రహదారి, బైపాస్ ఉండేలా రూపొందించారు. కోవూరు రోడ్డు, వెంకటాద్రిపాలెం, విక్కిరాలపేట, మహదేవపురం, అనందాపురం, చుట్టుగుంట, దివివారిపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లను 80 అడుగుల రోడ్డుగా మార్చారు. అలాగే పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు అయిన కనిగిరి, పామూరు, గుడ్లూరు, ఓవీ రోడ్లను 100 అడుగులు ఉన్నట్లు, పలు జంక్షన్‌లు, పార్కులు వంటివి నమోదు చేశారు. అలాగే కాలనీల్లోని అంతర్గ రోడ్లు, పలు చిన్న, చిన్న రోడ్లను కనీసం 30 అడుగులు ఉండేలా మార్పులు, చేర్పులు చేశారు. ఈ ప్లాన్ అమల్లోకి వచ్చిన తరువాత దానికి అనుగుణంగా అనుమతులు ఇవ్వనున్నారు. వాస్తవానికి రెండేళ్ల క్రితమే నూతన మాస్టర్‌ప్లాన్ తయారైంది. అయితే పలు సాంకేతిక కారణాల వల్ల తిరిగి మార్పులు చేయాలని ఉన్నతాధికారులు మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆ తరువాత మార్పులు, చేర్పులు చేసి పంపినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో పెండింగ్ ఉండిపోయింది. ఆ తరువాత ఎన్నికల రావడంతో దీని గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. తరువాత అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టిపెట్టడం లేదు.

2005 నాటి మాస్టర్ ప్లానే నేటికీ అమల్లో

1987 వరకు గ్రామపంచాయతీగా ఉన్న కందుకూరును పరిసర గ్రామాలను కలిపి నగర పంచాయతీగా మార్చారు. ఆ తరువాత మున్సిపాలిటీగా రూపాంతరం చెందగా 1988లో మొదటిసారిగా మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగాయి. 2001లో గ్రేడ్–2 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. తరువాత 2005లో కందుకూరు మున్సిపాలిటీకి సంబంధించి మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు అదే మాస్టర్‌ప్లాన్ అమల్లో ఉంది. అంటే దాదాపు 19 ఏళ్ల నుంచి అదే మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నారు. కానీ గడిచిన 19 ఏళ్ల కాలంలో పట్టణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పట్టణ జనాభా విపరీతంగా పెరడడంతో పాటు మున్సిపాలిటీ నుంచి తొలగించిన గ్రామాలు తిరిగి మున్సిపాలిటీ కలవడం వల్ల విస్తీర్ణం కూడా పెరిగింది. కానీ పెరిగిన పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు లేకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు, పట్టణానికి అనుగుణంగా రోడ్ల విస్తీర్ణం లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అలాగే కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అధిక రుసుంలు వసూల్ చేయాల్సి వస్తోంది. పెరిగిన జనాభాను, విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ నూతన మాస్టర్‌ప్లాన్‌కు అధికారులు రూపకల్పన చేశారు. అనేక మార్పులతో నూతన మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను తయారు చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపారు. ఉన్నతాధికారుల నుంచి నూతన మాస్టర్‌ప్లాన్‌కు అమోదం మాత్రం లభించడం లేదు.

సంపద తయారీపై దృష్టిసారించాలి

పామూరు: ఘన వ్యర్థాల నుంచి సంపద తయారీపై మండలంలోని అన్ని పంచాయతీల పీఎస్‌లు, సిబ్బంది దృష్టిసారించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, డీఎల్‌పీఓ హనుమంతరావు సూచించారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శుక్రవారం ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓఆర్‌డీ జి.అరవిందారెడ్డి అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై పీఎస్‌లు, గ్రీన్ అంబాసిడర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నుంచి సేకరించే చెత్తను ఇంటి వద్దే తడి, పొడి చెత్తగా విభజించి సేకరించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. జి.రత్నకుమార్, పి.వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, కేవీ రమణయ్య, సయ్యద్ అమీర్‌బాబు, పందిటి హరీష్, మెంటా నరసింహారావు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం



గాంధీ, అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు

సింగరాయకొండ: చెత్త నుంచి సంపద సృష్టించడం వలన పంటలకు ఆరోగ్యవంతమైన ఎరువు లభించడమే కాకుండా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని గ్రామ సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ డి.జయమణి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై ఒక్కోరోజు ఒక్కో మండల అధికారులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆరురోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి శిక్షణ ప్రారంభించారు. కొండపి ఎంపీడీఓ రామాంజనేయులు, ఈఓఆర్‌డీ అంజలీదేవి, ఈఓలు కె.రామారావు, షేక్ సుభాని, కొండపి మండలంలోని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోవడం సిగ్గుచేటు

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: రాష్ట్ర ప్రజలకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యలను గాలికి వదలడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. వింత కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. 2024 ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1,500లు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని దుయ్యబట్టారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతుంటే కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని మండిపడ్డారు. 2019లో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 99 శాతం అమలు చేసిందని గుర్తు చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమ పాలన జరిగిందని దద్దాల నారాయణ కొనియాడారు.

26న బహిరంగ వేలం

కొండపి: మండలంలోని జాళ్లపాలెంలో గల వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఉగాది మహోత్సవం సందర్భంగా లీజు హక్కులకు ఈ నెల 26వ తేదీ దేవదాయ ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో కొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండు కొబ్బరి చిప్పలు అమ్ముకునే హక్కు, ప్రసాదం అమ్ముకునే హక్కులకు వేలంపాట నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు రూ.25 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. ఎవరైతే పాటలో అధిక ధర చెల్లిస్తారో వారికి మాత్రమే లీజు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాట ముగిసిన వెంటనే మొత్తం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేలంపాటలో పాల్గొనే హెచ్చుపాటదారుడు తన చిరునామా రుజువు చేసే పత్రం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ, సెల్ నంబర్‌ను అధికారులకు ఇవ్వాలని తెలిపారు. ఎవరైతే అధిక ధరకు వేలం పాట దక్కించుకుంటారో వారు స్వయంగా వ్యాపారం చేసుకోవాలని, సబ్ లీజులు, మార్పులు చేయరాదని, అలా ఎవరైనా చేస్తే వారి లీజు రద్దు చేస్తామని తెలిపారు. ఈ హక్కులు ఉగాది ముందు రోజు నుంచి ఉగాది మరుసటి రోజు వరకు మాత్రమే అని తెలిపారు.

పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూడాలి



వేలాన్ని పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు



టంగుటూరులో వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఆర్‌ఎం శ్రీనివాసరావు

కొండపి: పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు పొగాకులో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందన్నారు. వేలం నిర్వహణపై రైతులకు, బోర్డు సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేజీ పొగాకు గరిష్ట ధర రూ.280

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు గరిష్ట ధర రూ.280 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. పెద్దకళ్లగుంట, నరసరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 349 బేళ్లను వేలానికి తీసుకురాగా, 313 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 36 బేళ్లను తిరస్కరించారు. కేజీ సరాసరి రూ.275.03, కనిష్ఠ ధర రూ.260 పలకగా, వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు వేలానికి అనుగుణంగా నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకొచ్చి అధిక ధరలు పొందాలని పొగాకు బోర్డు ఆర్‌ఎం శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రం పరిధిలోని చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం 275 బేళ్లను వేలానికి తీసుకురాగా, వాటిలో 222 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలపై 53 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260 పలకగా, సరాసరి రూ.273.12 పలికింది. వేలంలో మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ పంపిణీ చేస్తున్న కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఎం గోపీనాథ్

కొండపి: వయోజన విద్యాశాఖ, డీఆర్‌డీఏ వెలుగు శాఖ సమన్వయంతో ఈ నెల 23వ తేదీ మహిళా వయోజనులకు నిర్వహించే పరీక్షల కోసం మెటీరియల్‌ను స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో శుక్రవారం వయోజన విద్య కో ఆర్డినేటర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం బి.గోపీనాథ్ వీవోఏలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపి మండలంలో ఉల్లాస్ మొదటి విడత ఎంపిక చేసిన పెరిదేపి, చిన్న వెంకన్నపాలెం, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, నేతివారిపాలెం గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పరీక్ష ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు ప్రతి ఒక్క అభ్యాసకురాలు తప్పకుండా హాజరయ్యే విధంగా చూసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సంబంధిత సెంటర్లలో కేటాయించిన వీవోఏలు సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారా.. లేదా..? అని సంబంధిత క్లస్టర్ కో ఆర్డినేటర్లు పర్యటిస్తూ మోనిటరింగ్ చేసి పరీక్షలు సక్రమంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు డి.మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, రమణమ్మ, అకౌంటెంట్ కోటేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

రత్నకుమారికి నివాళులు



రత్నకుమారి మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చొప్పర వెంకన్న సతీమణి, అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమారి శుక్రవారం బాలయోగినగర్‌లోని నివాసంలో అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఆమెకు పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకన్నను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా మట్టిఖర్చులకు రూ.15 వేలను వెంకన్నకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, రాపూరి ప్రభావతి, పి.సునీల్, షేక్ నౌషాద్, కె.హనుమంతరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రత్యేక పూజల్లో నూతన కమిటీ సభ్యులు

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానం నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. తొలుత నూతన కమిటీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేసింది. అనంతరం నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు బోయళ్ల తిరుపతి రెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కోప్పరపు వెంకట కోటా సత్యనారాయణ, కార్యదర్శి బాలు ఓబులరెడ్డి, కోశాధికారి ముచ్చర్ల ధర్మ, సంయుక్త కార్యదర్శులు, సంయుక్త కోశాధికారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. పాత పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లును నూతన కమిటీ ఘనంగా సన్మానించింది.

అప్పారి వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

కనిగిరి రూరల్: విద్య రంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేసిన గొప్ప నాయకుడు అప్పారి వెంకటస్వామి..అని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.రమణారెడ్డి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎస్‌కే ఖాజా రహంతుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో జీవితాన్ని త్యాగం చేసిన మహోనీయుడు అప్పారి..అని కీర్తించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాము, వి.మాలకొండారెడ్డి, కె.కృష్ణమూర్తి, కె.వెంకటేశ్వర్లు, పట్నం నరసింహం, జెడ్ రమణయ్య, బి.మల్లికార్జునరావు, కేవీ బాలకృష్ణ, జిలానీ, బ్రహ్మయ్య, టీవీ సుబ్బారెడ్డి, బి.మాల్యాద్రి పాల్గొన్నారు.

ఎర్త్ అవర్‌పై అవగాహన

కనిగిరి రూరల్: ఎర్త్ అవర్ గ్లోబల్ ఉద్యమంలో భాగంగా మార్చి 22 శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు అనవసరమైన లైట్లను ఆపేసి ఎర్త్ అవర్‌ను పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసఫ్ సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, సంస్థ ప్రతినిధి మంద్రు రమేష్, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

హనుమంతునిపాడు: 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు, 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ టి.అంజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఫస్టియర్ ఇంటర్‌లో సీఎస్‌ఈ గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

పీసీపల్లి: స్థానిక కేజీబీవీలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశాల కోసం, 7వ తరగతి, 12 వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని పేద విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 88863 92717, 77020 76045 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

సీఎస్‌పురం (పామూరు): 2025–26 విద్యాసంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక కేజీబీవీ విద్యాలయం ప్రిన్సిపాల్ షేక్ రేష్మ సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని, క్లాసుల వారీగా ఖాళీల వివరాలు 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 24, 9వ తరగతిలో 8, 10వ తరగతిలో 3, 11వ తరగతిలో 40 సీట్లు, 12వ తరగతిలో 22 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నాయని ఆమె పేర్కొన్నారు. వివరాలకు 79818 82238 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

బయోగ్యాస్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపురం సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ఉత్పత్తి కోసం అవసరమైన స్థలాన్ని శుక్రవారం కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు. అక్కడ వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. ఇక్కడ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే పలువురు నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. పీఆర్ డీఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ అధికారి రాజేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ ధర్మతేజ పాల్గొన్నారు.